క్లుప్తంగా

మంగపల్లెలో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షల కోసం తరలివచ్చిన ప్రజలు

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన నంద్యాల గురు రాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్ అధినేత దస్తగిరి రెడ్డి ఆర్థిక సహకారంతో పెద్ది రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి నెలా ఉచిత శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు డాక్టర్లు రోగులకు గుండె జబ్బు, బీపీ, షుగర్, కంటి, ఊపిరితిత్తుల తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురురాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్లు మౌలాలి రెడ్డి, షేక్షావలి రెడ్డి పాల్గొన్నారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం



నగదు అందజేస్తున్న సావిత్రమ్మ కుటుంబ సభ్యులు

బనగానపల్లెరూరల్: మండలంలోని టంగుటూరు గ్రామంలో శ్రీ పెద్దమ్మ తల్లి నిత్యాన్నదాన భవన నిర్మాణానికి అప్పలాపురం గ్రామానికి చెందిన దివంగత కడపయ్యగారి వెంకటరెడ్డి సతీమణి సావిత్రమ్మ కుటుంబ సభ్యులు రూ.50,116 విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆదివారం నగదును నిత్యాన్నదాన సంస్థ నిర్వాహకులు రామగంగిరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, రామపుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీచౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి విరాళం



నగదు అందజేస్తున్న ఉలువల సురేష్‌కుమార్ రెడ్డి దంపతులు

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి ఇదే గ్రామానికి చెందిన ఉలువల సురేష్ కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు రూ.1.65లక్షలు విరాళంగా అందజేశారు. ఆదివారం ఆలయ మాజీ చైర్మన్ పీఆర్ వెంకటేశ్వరరెడ్డి దాతలు నగదు ఇచ్చారు. దాతలను సన్మానించి అమ్మారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, సంధ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సన్మానం



విజయమోహన్‌ను సన్మానిస్తున్న తపాలాశాఖ ఉద్యోగులు

బనగానపల్లెరూరల్ : స్థానిక తపాలాశాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్టల్ అధికారి(ఐపీఓ) విధులు నిర్వహిస్తున్న విజయమోహన్ అసిస్టెంట్ సూరింటెండెంట్ అధికారి (ఏఎస్‌పీ)గా కర్నూలుకు పదోన్నతిపై వెళ్లారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పోస్ట్ మాస్టర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో విజయమోహన్‌ను ఆ శాఖ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఆయనకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో భానుముక్కల పోస్ట్ మాస్టర్ విజయ్, పోస్టల్ ఏజెంట్ శివనాగిరెడ్డి, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, పేరుసోముల గ్రామాలకు చెందిన పోస్ట్‌మాస్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి



వెంకటలచ్చమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లె : మండలంలోని యనకండ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇడిగ వెంకటలచ్చమ్మ(65) మృతి చెందారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు వైఎస్సార్‌సీపీ యువనేత కాటసాని ఓబులరెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాలరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి తదితరులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కోడూరు రామచంద్రారెడ్డి, వడ్డె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు.. రైతుకు భరోసా!

- రైతులు నష్టపోకుండా అండగా నిలుస్తున్న ప్రభుత్వం
- వ్యవసాయ పథకాలన్నింటికీ ఈ క్రాప్ బుకింగ్ ప్రామాణికం
- సెప్టెంబర్ 15 వరకు గడువు



కమలపురిలో ఈ - క్రాప్ నమోదు చేస్తున్న వీఏఏ జిలాన్ (ఫైల్)

సంజామల: వ్యవసాయ రంగానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యనిస్తుంది. పెట్టుబడి సాయం నుంచి దిగుబడులు అమ్ముకునే వరకు అన్నివిధాలుగా అండగా నిలుస్తుంది. వ్యవసాయం దండగ అన్న వారికి చెంపపెట్టులా.... సాగు పండగ అనేలా రైతాంగానికి వివిధ పథకాలు అమలు చేస్తుంది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం. ప్రత్యేకించి విత్తనం వేసిన ఏ రైతూ ఏ విధంగా నష్టపోకుండా ఆదుకునేలా పంట నమోదు(ఈ క్రాప్ బుకింగ్) కార్యక్రమాన్ని అమలు చేస్తూ సాగుకు భరోసా కల్పిస్తుంది. పంట నమోదు కార్యక్రమం అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపునకు మూలమనే విషయాన్ని రైతులకు అర్థమయ్యేలా వ్యవసాయ, ఆర్బీకే అధికారులు, సిబ్బంది వివరిస్తున్న తీరు సత్ఫలితాలిస్తుంది. ఈ క్రాప్ నమోదుకు రైతులు సైతం మొగ్గు చూపుతున్నారు. దీంతో ఈ ప్రక్రియ జోరుగా సాగుతుంది. సంజామల మండలంలో 17 వేల హెక్టార్లు వ్యవసాయ భూమి ఉంది. మెత్తం 13,825 మంది రైతులు ఉన్నారు. ఖరీఫ్ సీజన్‌లో 5,000 ఎకరాలలో రైతులు సాగు చేశారు. ప్రధానంగా మిరప, మొక్కజొన్న, మినుము, వరి తదితర పంటలు సాగయ్యాయి. అదేవిధంగా ఇప్పటి వరకు దాదాపు 2,000 ఎకరాలలో సాగు చేసిన పంటలను రైతులు ఈ– క్రాప్ బుకింగ్ చేసుకున్నారు. ఈ ప్రక్రియ సెప్టెంబర్ 15 వరకు సాగనుంది.

ఈ క్రాప్ నమోదుతో ఎన్నో ప్రయోజనాలు

ఈ క్రాప్ బుకింగ్‌తో రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. సాగు చేసిన రైతులు పంట నమోదు చేసుకుంటే చాలు ఏ మాత్రం నష్టపోకుండా ప్రభుత్వం ఆదుకుంటుంది. వర్షాభావ పరిస్థితుల మూలంగా పంటనష్టం వాటిల్లితే ప్రభుత్వం నుంచి రైతులు పంట నష్టపరిహారం పొందే అవకాశం ఉంది. అదేవిధంగా సబ్సిడీపై విత్తనాలు, దిగుబడులు గోడౌన్‌లో నిల్వ, వీటిపై బ్యాంకు రుణాలు, గిట్టుబాటు ధర వచ్చినప్పుడే అమ్ముకునే అవకాశం ఉంటుది. అదేవిధంగా సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు పొందొచ్చు. కౌలు రైతులకు సైతం ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం పంట నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తుంది.

పంట నమోదు విధానం

సాగు చేసిన పంటలు, పొలాలకు సంబంధించిన వివరాలను రైతుభరోసా కేంద్రంలో వివరించాలి. పంట పొలం సర్వే నంబర్, ఆధార్ వివరాలను నమోదు చేయించుకోవాలి. అనంతరం వీఏఏలు రైతుల పంట పొలాల దగ్గరకు వచ్చి పంటలు సాగు చేసిన భూమితోపాటు రైతు ఫొటో తీసి ఆన్‌లైన్ చేస్తారు. ఈ ప్రక్రియలో రైతుతోపాటు సాగుచేసిన పంటల వివరాలు ఆన్‌లైన్ నమోదు అవుతాయి. దీంతో రైతులు వ్యవసాయానికి సంబంధించిన పథకాలన్నింటికీ అర్హత ఉంటుంది. ఈ నేపథ్యంలో రైతులు సైతం ఈ క్రాప్ నమోదుకు మొగ్గు చూపుతున్నారు.

రైతులకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్నివిధాలుగా అండగా నిలుస్తుంది. పంటల నమోదు కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. పంటనష్ట పరిహారం అందుతున్నందును రైతు పూర్తిగా నష్టపోడు. ఏ మాత్రం భయపడకుండా మళ్లీ సాగు చేసేందుకు పూనుకుంటాడు. అదేవిధంగా రైతుభరోసా కేంద్రాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. సాగుకు సంబంధించి ఆర్బీకే సిబ్బంది సూచనలు, సలహాలు బాగున్నాయి. ఎరువులు, పురుగు మందులతో పాటు విత్తనాలు, మద్దతు ధర కల్పిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తుంది.

– డి.ఉస్సేని, రైతు, సంజామల మండలం

పంట నమోదు చేయించుకోవాలి



ప్రభుత్వం అమలు చేస్తున్న పంట నమోదు వ్యవసాయ పథకాల అన్నింటికీ ప్రామాణికం. ఈ విషయంపై తమవంతు రైతులను చైతన్య పరుస్తున్నాం. గతంతో పోలిస్తే ప్రస్తుతం రైతులు చైతన్యమయ్యారు. రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి. సబ్సిడీపై విత్తనాలు, బ్యాంక్ రుణాలు, వ్యవసాయ పరికరాలు తదితర పథకాలు పొందాలంటే పంట నమోదు తప్పనిసరి. అప్పుడే రైతులు నష్టపోరు. ఈ నెల 15 వరకు ఈ క్రాప్ నమోదుకు గడువు ఉంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సుధాకర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి, సంజామల

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏడీఈ ఖాజావలి చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

బ్లాక్ హెల్త్ యూనిట్ పనులు ప్రారంభం

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో బ్లాక్ హెల్త్ యూనిట్ పనులు ప్రారంభమయ్యాయి. జాతీయ ఆరోగ్య మిషన్ పథకం కింద కొలిమిగుండ్లకు బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ మంజూరు అయ్యింది. భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.50 లక్షల నిధులు మంజూరు చేయడంతో పనులు మొదలు పెట్టారు. మూడు విభాగాలకు సంబంధించి నిర్మాణాలు చేపట్టనున్నారు. ఈసీజీతో పాటు అన్ని రకాల ల్యాబ్ టెస్టులు ఇక్కడే చేయనున్నారు. కొత్తగా వైద్యుల నియామకంతో పాటు ఆధునిక పరికరాలను కొనుగోలు చేయనున్నారు. బ్లాక్ హెల్త్ యూనిట్ అందుబాటులోకి వస్తే ప్రజలకు మరిన్ని వైద్య సేవలు సమకూరనున్నాయి.

వరుణ దేవుడి కరుణ కోసం పూజలు



గంగమ్మ పూజకు వెళ్తున్న గ్రామ పెద్దలు

ప్యాపిలి: మండలంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోతున్నాయి. దీంతో స్థానిక పెద్దమ్మ కొండపై వెలసిన గ్రామదేవత పెద్దమ్మకు ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గత రెండు రోజులుగా ఆలయంలో జాగరణ చేస్తూ వర్షం కోసం భజనలు చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణం నుంచి మేళతాళాల మధ్య ఊరేగింపుగా వెళ్లి పట్టణ పొలిమేరలో వెలసిన గంగమ్మకు పూజలు చేశారు.

బేతంచెర్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు వాడుపడుతుండటంతో రైతులు వరుణ దేవుని అనుగ్రహం కోసం ఆలయాల్లో పూజలు, భజనలు చేస్తున్నారు. బుక్కాపురం గ్రామస్తులు సమీప గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి భజనలు చేస్తున్నారు. ఎం.పేండేకల్లుగ్రామంలో గ్రామసమీపాన వెలసిన మద్దిలేటినరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. పట్టణంలోని బైటిపేట రైతు సంఘం ఆధ్వర్యంలో భజనలు చేస్తూ వాన దేవుడా కరుణ చూపవయ్యా అంటూ భక్తి గీతాలు ఆలపిస్తున్నారు.

వర్షం కోసం వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు



పలుకూరు గ్రామంలోని రామాలయంలో వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



బనగానపల్లె పట్టణంలోని బీసీ కాలనీలో బొమ్మలకు వివాహం చేస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: మండలంలోని పలుకూరు శ్రీరామాలయంలో ఆదివారం గ్రామానికి చెందిన బ్రహ్మంగారి భక్త బృందం ఆధ్వర్యంలో వర్షాలు కురవాలని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాం కురవలని రైతులతోపాటు అన్నివర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని బ్రహ్మంగారి చిత్రపటం వద్ద భజన చేశారు. కార్యక్రమంలో జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బ్రహ్మానంద ఆచారి, అర్చకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వరుణుడు కరుణించాలని బొమ్మలకు వివాహం

బనగానపల్లె పట్టనంలోని బీసీ కాలనీలో కాలనికి చెందిన ప్రజలు వర్షాలు కురవాలని బొమ్మలకు వివాహం చేశారు. అదేవిధంగా హిందూ ముస్లిం సోదరులు చందాలను సేకరించి పెట్రోల్‌బంకు సమీపంలోని దస్తగిరిస్వామి దర్గాలో స్వామికి జెండా సమర్పించారు. అనంతరం కాలనీలో బొమ్మలను వధూవరులుగా ఆలంకరించి వివాహం జరిపించారు. తదనంతరం పెళ్లి భోజనం ఆరగించారు.

జాతీయ స్థాయి చెస్ పోటీల్లో డోన్ విద్యార్థి ప్రతిభ



చెస్ పోటీల్లో పాల్గొన్న హర్షిత్

డోన్ టౌన్ : హైదరాబాద్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న డోన్‌కు చెందిన విద్యార్థి హర్షిత్ ఉత్తమ ప్రతిభ కనబరచి ట్రోఫీని అందుకున్నాడు. ఈనెల 25వ తేది నుంచి ఆదివారం వరకు హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో స్లాస్ (ఎస్‌ఎల్‌ఏఎస్)ఆధ్వర్యంలో ఫస్ట్ ఇంటర్ నేషనల్ గేమ్స్ పోటీలు జరిగాయి. అండర్ 16 విభాగంలో పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన శాంతికుమార్ ఉమాదేవి దంపతుల కుమారుడు హర్షిత్ ఉత్తమ ప్రతిభ చాటాడు. 6వ రేటింగ్‌తో నిలవడంతో నిర్వాహకులు ట్రోఫీని అందించి అభినందించారు.

కృష్ణాష్టమి వేడుకలకు ఆహ్వానం

కొలిమిగుండ్ల: త్రైత సిద్ధాంతం,ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6వ తేది నుంచి నిర్వహించనున్న కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొనాలని కోరుతూ శనివారం ఎస్ఐ రమేష్‌రెడ్డికి సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ప్రతి ఏటా మాదిరిగానే గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ప్రబోధ సేవా సమితి కమిటీ సభ్యులు రామకృష్ణారెడ్డి, పీఎంహెచ్ నాయుడు పేర్కొన్నారు.

అసత్య ప్రచారాలను సహించం

- సంక్షేమ పాలనను ఓర్వలేకనే టీడీపీ కుట్ర రాజకీయాలు
- మంత్రి బుగ్గన వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగిస్తే పరువునష్టం దావా వేస్తాం
- రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

డోన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేకనే టీడీపీ నాయకులు అసత్యారోపణలకు పాల్పడుతున్నారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ విమర్శించారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్థానిక స్వగృహంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి, ఆయన అనుచరులు ప్రజలను మభ్యపెట్టేందుకు అవాస్తవాలు మాట్లాడుతున్నారన్నారు. ప్రతి ఇంటికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధి చేకూరిందని, అదేస్థాయిలో ప్రజాభిమానం పెరిగిందన్నారు. అయితే ప్రజలకు మేలు జరుగుతుంటే ఓర్వలేక టీడీపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారన్నారు. పట్టణ నడిబొడ్డున నిర్మిస్తున్న ఆధునిక కూరగాయల మార్కెట్‌పై గతంలో ఉన్న షాప్ యజమానులను తప్పుదోవ పట్టించేందుకు కుట్రలు పన్నడం సిగ్గుచేటన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పరువు ప్రతిష్టలకు భంగం కలిగించే రీతిలో అసత్య ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులపై పరువునష్ట దావా వేస్తామని వారు హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, కౌన్సిలర్లు దినేష్‌గౌడ్, మల్లికార్జునరెడ్డి, ఆర్ట్ రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్ఈ రాజవర్ధన్, మేకల రాజు, కాలేషా పాల్గొన్నారు.

పాత వారికి షాపులు

పట్టణ నడిబొడ్డున నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్‌లో పాత మార్కెట్‌లో ఉన్న దుకాణందారులందరికీ తిరిగి షాపులు కేటాయించడం జరుగుతుందని, ఎలాంటి సందేహాలు అక్కర్లేదని శ్రీరాములు, రాజేష్ భరోసా ఇచ్చారు. మిగిలిన షాపుకలు బహిరంగంగా వేలం ద్వారా కేటాయిస్తామని, అసత్య ప్రచారాలను నమ్మొద్దని సూచించారు. ప్రస్తుతం 48 గదులతో సెల్లులార్, మొదటి అంతస్తు నిర్మాణం పూర్తయిందని, మరో 48 గదుల నిర్మాణం ప్రారంభమైందన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యం

ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా మంత్రి బుగ్గన ముందుకు సాగుతున్నారని శ్రీరాములు, రాజేష్ తెలిపారు. గతంలో మార్కెట్ ఎంత అసౌకర్యంగా ఉన్నదన్న విషయం పట్టణ ప్రజలందరికీ తెలుసు అన్నారు. గతంలో పురపాలక ఏలికలైన టీడీపీ నాయకులు వ్యాపారులు, ప్రజల ఇబ్బందులను ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదని ధ్వజమెత్తారు. మంత్రి బుగ్గన మార్కెట్ నిర్మాణం కోసం రూ.10కోట్ల మంజూరు చేయించారన్నారు. మిగిలిన రెండవ అంతస్తు నిర్మాణాలను బ్యాంకు రుణాలతో పూర్తిచేస్తున్నామన్నారు. మంత్రి బుగ్గన రూ. 2,300కోట్లతో డోన్‌ను రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతుంటే ఓర్వలేక టీడీపీ నాయకులు నిత్యం అసత్య ప్రచారాలు చేస్తుండటాన్ని ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో గుణపాఠం చెబుతారన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో పౌష్టికాహారం పంపిణీ

డోన్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో బాలింతలు, గర్భిణులకు ఆదివారం ప్రార్థన సమయం నిర్వాహకులు జాన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో రొట్టె, గుడ్డు, పప్పు పంపిణీ చేశారు. ప్యాపిలి మండలం బావిపల్లెకు చెందిన రెడ్డి జనార్దన్ ఆర్థిక సాయంతో ఆసుపత్రిలో పౌష్టికాహారం పంపిణీ చేశామని జాన్‌ప్రభాకర్ తెలిపారు. ఆసుపత్రిలో చేరిన వారికి పౌష్టికాహారం అందజేయడం అభినందనీయమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఫక్రుద్దీన్, రాజేష్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

బేతంచెర్ల: ఏపీ రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి రామ్ మోహన్ ఆధ్వర్యంలో ఆదివారం రంగాపురం, అంబాపురం, రహిమానుపురం గ్రామాల్లో సాగు చేసిన పంటలను నాయకులు పరిశీలించారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి అరకొర వర్షాలకు రైతులు పంటలు సాగు చేశారని, వర్షం కురువనందున పంటలు ఎండి పోతున్నాయని, వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కిష్టన్న, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట్రాముడు, లింగారెడ్డి, ఇద్రూస్ బాషా, తిరుపం రెడ్డి పాల్గొన్నారు.



ఒకే వేదికపై గురువులతో పూర్వవిద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

సంజామల: మండల కేంద్రం సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1983–84లో పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఒకే వేదికపై చేరారు. దాదాపు 80 మంది పూర్వ విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు కలుసుకోవడంతో పాఠశాలలో సందడి నెలకొంది. ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకుంటూ పాత జ్ఞాపకాలు, అనుభూతులు గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. రాబోయే రోజుల్లో పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు బీమలింగయ్య, రామన్న, మునయ్య, వీరభద్ర, యాగంటప్ప, ఆనందమ్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెండెకంటి కిరణయ్య, శిల్ప సుబ్రహ్మణ్యం, రియాజ్, మహేష, వహిద బేగం తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

బనగానపల్లెరూరల్ : మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన కాట్రెడ్డి గోవర్ధన్‌రెడ్డిపై బెదిరింపులు, దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి ఆదివారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు ఇదే గ్రామానికి చెందిన ఇమ్మనబోయిన బలరాముడు, గోవర్ధన్‌రెడ్డి పొలాలు పక్కపక్కనే ఉన్నాయి. గోవర్ధన్‌రెడ్డి తన పొలాన్ని ఏటేటా జరుపుతూ బలరాముడు పొలంలోకి అక్రమంగా చొరబడుతున్నాడు. ఆయన ఈ ఏడాది కూడా బలరాముడు పొలాన్ని అక్రమించుకొని కాల్వ తీశాడు. దీంతో ఎందుకు తనపొలంలో కాల్వ తీశావని బాధిత రైతు ప్రశ్నించాడు. ఆవేశానికి గురైన గోవర్ధన్‌రెడ్డి...బలరాముడిపై కర్రతో దాడి చేయడంతోపాటు చంపుతానని బెదరించాడు. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు గోవర్ధన్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్యభర్తలపై కేసు

నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని టంగుటూరు గ్రామానికి చెందిన గౌతరం సుబ్బరాయుడు, మద్దమ్మ దంపతులపై బెదిరింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన ఆకుమళ్ల బాలమద్దిలేటి చెందిన స్థలాన్ని అక్రమించుకోవాలనే ఉద్దేశ్యంతో ఆ దంపతులు దాడికి పాల్పడ్డారు. ట్రాక్టర్‌పై వెళ్తున్న ఆకుమళ్ల బాలమద్దిలేటిని ఆపి, నీవు రోడ్డు పై తిరగరాదంటూ గౌతరం సుబ్బరాయుడు, మద్దమ్మ దంపతులు దాడి చేసి, బెదిరింపులకు పాల్పడినట్లు బాధిత రైతు బాలమద్దిలేటి తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

డోన్ టౌన్ : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడుదామని సీపీఎం పట్టణ మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కొయిలకొండ నాగరాజులు పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెటుందని, ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 4వ తేది వరకు సీపీఎం ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా చేపట్టే సమర భేరి పోరాటాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో నాయకులు రామాంజనేయులు, శివరాం, నాగమద్దయ్య, షమీమ్‌బేగం, మాణిక్యంశెట్టి,అ బ్దుల్ లతీఫ్, నక్కి హరి,హబీబ్ బాషా, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

బనగానపల్లె: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివారం ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఉపాధ్యాయుల వేతనాలు చెల్లించాలని ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు మధుసూదన్‌రావు కోరారు. కార్యక్రమంలో నాయకులు కుమార్‌బాబుయాదవ్, చాంద్‌బాషా, బాలాజీనాయక్, ఖాద్రి, రెహమాన్, కృష్ణయ్య, బాషా తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల సమస్యకు పరిష్కారం !


- రూ. కోటితో ఓవర్‌ట్యాంక్‌ల నిర్మాణం
- ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఏర్పాటుకు రూ.77.60 లక్షలు మంజూరు



నాగిశెట్టిపల్లెలో పూర్తయిన ఓవర్‌హెడ్ ట్యాంక్

కొలిమిగుండ్ల: ప్రజా సంక్షేమం కోసం పని చేసే ప్రభుత్వాలు..మనసున్న పాలకులు ఉంటే ఏదైనా జనం చెంతకే చేరుతాయనడంలో సందేహం లేదు. గ్రామాలు అవతరించి దశాబ్దాలు గడుస్తున్నా సరైన మంచినీటి వనరులు లేని గ్రామాలకు శాశ్వత పరిష్కారం త్వరలోనే లభించనుంది. ఎన్నో ప్రభుత్వాలు, పాలకులు మారిపోయారు. కానీ ఎన్నికల సమయంలో మాత్రమే ఊర్లు, ప్రజలు కనిపించేవాళ్లు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాడ్డాక గ్రామాల్లో ఎన్నో ఏళ్ల నుంచి నెలకొన్న సమస్యలకు మోక్షం లభిస్తుంది. బి.ఉప్పలూరు గ్రామ పంచాయితీ పరిధిలో నాగిశెట్టిపల్లె, బితాడిపత్రి మజారా గ్రామాలు ఉన్నాయి. ఈమూడు గ్రామాలకు మొదటి నుంచి ఓవర్ హెడ్ ట్యాంక్‌లు లేవు. చేతి పంపులు లేదా డైరెక్ట్ పంపింగ్ ద్వారా నీటి సరఫరా జరుగుతుండేది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఈపంచాయితీపై ప్రత్యేక దృష్టి సారించారు. జల్‌జీవన్ మిషన్ కింద మొదటి విడతలో కోటి రూపాయలు మంజూరు కావడంతో మూడు గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంక్‌లు నిర్మించారు. రెండో విడతలో ఇటీవలనే రూ.77.60 లక్షలు విడుదల అయ్యాయి. ఈనిధులతో తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు మూడు గ్రామాల్లో పైపులైన్ నిర్మించి ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టనున్నారు. ట్యాంక్‌ల పనులు పూర్తి కావడంతో త్వరలోనే పైపులైన్ పనులు మొదలు పెట్టి ప్రజలకు నీటి సౌకర్యం అందించనున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత గ్రామాలకు ఓవర్ హెడ్ ట్యాంక్‌లతో పాటు కుళాయి కనెక్షన్‌లు రానుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

భవిష్యత్‌లో తాగునీటి సమస్య ఉండదు



పంచాయితీ పరిధిలోని మూడు గ్రామాల ప్రజలకు భవిష్యత్‌లో తాగునీటి సమస్య ఉండదు. ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి చొరవతోనే నీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఇప్పటికే మూడు ఓవర్ హెడ్ ట్యాంక్‌ల పనులు పూర్తయ్యాయి. పైపులైన్ వేసి కుళాయి కనెక్షన్ అందిస్తాం. తన హయాంలో నీటి సమస్య తీరుతున్నందుకు సంతోషంగా ఉంది. – ఈశ్వరయ్య, సర్పంచ్